దిగుబడి రాలేదప్పా...

- రబీ సీజన్‌లో తెగుళ్లతో దెబ్బతిన్న వేరుశనగ
- ముంచేసిన మచ్చ, ఎండు తెగులు, రసంపీల్చు పురుగు
- గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం
- అప్పులపాలవుతున్న అన్నదాతలు

కనగానపల్లి: రబీ సీజన్‌లో బోరుబావుల కింద వేరుశనగ సాగు చేసిన రైతులకు నిరాశ ఎదురైంది. ఖరీఫ్‌లో వచ్చిన నష్టాలను పూడ్చుకుందామని భావించిన అన్నదాతలకు నష్టాలు మిగులుతున్నాయి. రాప్తాడు నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 15 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. ఖరీఫ్ ఆఖరులో వర్షాలు కురవడం, బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉన్న రైతులు ఎక్కువగా వేరుశనగ సాగుకు మొగ్గు చూపారు. అయితే పంటలు సాగు చేసిన 15 రోజులకే మచ్చ తెగులు వ్యాపించి పంట ఎదుగుదలను దెబ్బతీసింది. వీటితో పాటు రసంపీల్చు పురుగు, ఎండుతెగులు వ్యాపించాయి. తెగుళ్ల నివారణకు ఎన్నిసార్లు మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. గత ఏడాది ఆఖరులో సాగు చేసిన ఈ పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. అయితే చాలా ప్రాంతాల్లో పంట దిగుబడులు నిరాశజనకంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరానికి కనీసం 10 బస్తాల దిగుబడి రాక నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. కొన్నిచోట్ల పంట దిగుబడులు లేక రైతులు ముందుగానే పంటను తొలగించి పశుగ్రాసానికి వాడేసుకుంటున్నారు.

ఎకరాకు రూ.30 వేల పెట్టుబడి

వేరుశనగ పంటకు రాష్ట్ర ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించడం లేదని రైతులు వాపోతున్నారు. బోరుబావుల కింద ఈ పంట సాగు చేసేందుకు ఎకరానికి రూ.30 వేల దాకా పెట్టుబడి పెట్టారు. తెగుళ్లతో ఎకరానికి 10 బస్తాల దిగుబడి కూడా రాలేదని చెబుతున్నారు. దీనికి తోడు ప్రస్తుతం మార్కెట్లో వేరుశనగ కాయలు బస్తా రూ.2,500 కూడా ధర పలకడం లేదు. పంట పెట్టుబడులు కూడా దక్కక చాలా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ పంటకు ప్రభుత్వం కనీసం రూ.4 వేల (బస్తాకు) మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.


కనగానపల్లి వద్ద దిగుబడి లేని వేరుశనగ పంట

పంట దెబ్బతింది



ఈ రబీలో మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. సాగు చేసిన 15 రోజుల నుంచే తెగుళ్లు వ్యాపించాయి. వీటి నివారణ కోసం ఇప్పటి వరకూ 8 సార్లు పురుగు మందులు పిచికారీ చేయించాం. అయినా తెగుళ్ల వ్యాప్తి తగ్గలేదు. పంటల సాగుకు రూ.40 వేల దాకా ఖర్చు చేశాను. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. దిగుబడి తగ్గిపోయి చాలా నష్టపోవాల్సి వచ్చింది.
– సంజీవరెడ్డి, రైతు, తగరకుంట

గిట్టుబాటు ధర కల్పించాలి



వేరుశనగ పంటకు ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రస్తుతం బయట మార్కెట్లో బస్తా రూ.2,500 కూడా పలకటం లేదు. పంట దిగుబడులు నామమాత్రంగా ఉన్నాయి. గిట్టుబాటు ధర లేక రూ.లక్ష దాకా నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరం ఉంది.
– చిన్నపెద్దిరెడ్డి, రైతు, బాలేపాళ్యం

క్లుప్తంగా

శివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణవేణి

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ కృష్ణవేణి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆమె కాటికోటేశ్వర స్వామి గుడికట్టుదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి గొడవలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఐకమత్యంతో ఆలయ సంప్రదాయాల ప్రకారం ఉత్సవాలను జరుపుకోవాలన్నారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజలు

పుట్టపర్తి అర్బన్: వేసవి నేపథ్యంలో వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎనుములపల్లి వైద్యాధికారులు పేర్కొన్నారు. శుక్రవారం సుబ్బరాయనిపల్లిలో వైద్య ఆరోగ్యసిబ్బంది, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ ఫిబ్రవరిలోనే 35 నుంచి 38 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత నమోదవుతోందని, ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు చిన్న పిల్లలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కాటన్ దుస్తులను ధరించడంతోపాటు గొడుగు, నీళ్లు, ఓఆర్‌ఎస్ ద్రావణం తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలన్నారు. పండ్లరసాలు, కొబ్బరి నీళ్లు అధికంగా తాగాలన్నారు. సీహెచ్‌ఓ నగేష్, సబ్ యూనిట్ అధికారి రమణయ్య, ఎంఎల్‌హెచ్‌పీ సత్యమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలపై నిర్లక్ష్యం వీడాలి


మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి మధు

తాడిమర్రి: పేదల అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీపీఐ ధర్మవరం నియోజక వర్గ కార్యదర్శి ముసుగు మధు పేర్కొన్నారు. పిన్నదరి గ్రామంలో శుక్రవారం ఆయన చేతివృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జింకా చలపతి, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల ప్రకారం గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలాన్ని మంజూరు చేయాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బీసాని లక్ష్మీనారాయణ, బత్తలపల్లి మండలం సీపీఐ కార్యదర్శి వెంకటేష్, నాగభూషణ, సన్నపెద్దన్న, నారాయణ పాల్గొన్నారు.

కంది పంటకు నిప్పు

గాండ్లపెంట: బనాన్‌చెరువుపల్లిలో కందిపంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడం దగ్ధమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు పులగంటి రవీంద్రారెడ్డి ఆరు ఎకరాల్లో సాగు చేసిన కంది పంటను మూడు రోజుల క్రితం కోసి కల్లంలో ఎండబెట్టాడు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పంట మొత్తం కాలి బూడిదైంది. ఘటనలో రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్

పుట్టపర్తి టౌన్: వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక సాయి ఆరామంలో శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సదస్సు నిర్వహించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర నాయకులు పార్థసారథి, జాతీయ కార్యవర్గ సభ్యులు అంబటి సతీష్ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉత్తమరెడ్డి, ప్రధాన కార్యదర్శులు అమరేంద్ర, కత్తి రాజారెడ్డి, మేకల శ్రీనివాస్, సుదర్శన్, రాష్ట్ర కల్లుగీత ఫెడరేషన్ కన్వీనర్ హరికృష్ణ, జిల్లా మీడియా కన్వీనర్ జ్యోతిప్రసాద్ పాల్గొన్నారు.

రక్తహీనతను నివారించాలి


బాలింతలు, గర్భిణులకు కూరగాయలు, ఆకుకూరలను అందిస్తున్న దృశ్యం

తనకల్లు: గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం, రకత హీనతను నివారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ సిబ్బందికి సూచించారు. కోటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ వాటిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో సాక్షం(స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టైనబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం, రక్తహీనతను నివారణ కోసం సేంద్రియ ఎరువులతో పండించిన ఆకుకూరలు, కూరగాయలను అందజేస్తున్నామన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు కూరగాయలు, ఆకు కూరలను పంపిణీ చేశారు. మహిళా కార్యదర్శి ఫాతీమా, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు ప్రారంభించాలి


ఏఓ నాగరాజుకు వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని త్వరగా ఒంటిపూట బడులు ప్రారంభించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో ఏఓ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా ఒంటి పూట బడులు ప్రారంభించాలన్నారు. మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు త్వరగా ప్రారంభమవుతాయని పరీక్షా కేంద్రాలు గుర్తించి మౌలి సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు బస్సులు నడిపాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఏఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మల్లికార్జున, మహేష్‌నాయక్, కిరణ్, బాను, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


బుక్కపట్నంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు


కొక్కంటిక్రాస్ వద్ద తెలుగు అక్షరాల ఆకారంలో విద్యార్థులు

పుట్టపర్తి: బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ మగ్బుల్ హుస్సేన్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలుగు భాష ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ మాతృభాషపై మక్కువ పెంచుకోవాలన్నారు. అధ్యాపకులు రవికుమార్, గంగరాజు, ఓబిలేసు, బాలాజీనాయక్, ఆనంద్ పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎం రమామణి ఆధ్వర్యంలో శుక్రవారం మాతృభాష దినోత్సవాన్ని జరుపుకున్నారు. పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వెంకటేషులు, గోపాలరావు, చెన్నకృష్ణారెడ్డి, నాగభూషణ, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: గూటిబైలు జెడ్పీఉన్నత పాఠశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాతృభాష ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం శాంతమ్మ, ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, చాంద్‌బాషా, నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: కొక్కంటిక్రాస్‌లో ఉన్న సరస్వతీ విద్యామందిరంలో శుక్రవారం అంతరాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సనత్‌కుమార్ మాట్లాడుతూ మాతృభాష తల్లిపాలతో సమానమన్నారు.

పీహెచ్‌సీలో అపరిశుభ్రతపై ఎంపీపీ ఆగ్రహం


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ రాము, ఎంపీడీఓ అంజనప్ప

ఎన్‌పీకుంట: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నెలకొన్న అపరిశుభ్రతపై ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ అంజనప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌డీసీ చైర్మన్, ఎంపీపీ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం రూ.85 లక్షల నిధులను మంజూరు చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణ, మందులు నిల్వ కోసం ర్యాక్‌లు, ఫ్రిజ్‌ల మరమ్మతు, స్టేషనరీ కొనుగోలుకు నిధులు వెచ్చించాలని, తీర్మానం చేశారు. అనంతరం వారు ఆసుపత్రిలోని గదులను పరిశీలించారు. ఆసుపత్రిలోని ఆర్‌ఓ ప్లాంట్ నిరుపయోగంగా ఉండటంపై వైద్యసిబ్బందితో ఆరా తీశారు. ఆర్‌ఓ ప్లాంట్ లేకపోతే వచ్చే రోగులకు తాగునీరు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. ఆసుపత్రిలోని మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉండి దుర్వాసన వస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ ఆసియా, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, వైద్య సిబ్బంది శాంతమ్మ, ప్రకాశ్, ఆది, విజయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం


జాప్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ధర్మవరం రూరల్: సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఏపీ(జాప్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనీల్‌కుమార్‌రెడ్డి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్షులు నందు టైమ్స్ భాస్కర్‌రెడ్డి, సద్దల ఆదినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో జాప్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు జాప్ జర్నలిస్టుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. జీఓ 38 రద్దు చేసి అందరికి అక్రిడిటేషన్లు మంజూరు చేయాలన్నారు. చిన్న పత్రికల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కేసాని రామకృష్ణ, జాప్ పట్టణ నాయకులు దాసరి సురేష్, కొమ్మరి శ్రీనివాసులు, మహేష్, నరసింహ, బత్తిని మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణ పనులు హర్షణీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

ఎన్‌పీకుంట: వాటర్‌షెడ్ పథకం కింద జల సంరక్షణ పనులు చేపట్టడం హర్షణీయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎన్‌పీకుంట మండలం ధనియానిచెరువు, వంకమద్ది, ఎన్‌పీకుంట, మరికొమ్మదిన్నె పంచాయతీల్లో వాటర్‌షెడ్ పథకం కింద రూ.10 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం వాటర్‌షెడ్ చైర్మన్లు, డైరెక్టర్లకు ఎమ్మెల్యే మెమొంటోలు అందించారు. ఎంపీపీ రాము, స్థానిక సర్పంచ్ ఆంజినమ్మ, పీడీలు సుధాకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, ఏపీడీ చైతన్య, ఎంపీడీఓ అంజినప్ప, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఏపీఓ చంద్రశేఖర్, ఎంఈఓ సుబ్బిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదుపై సమీక్ష


సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో రైతు విశిష్ట సంఖ్య నమోదుపై జిల్లా వనరుల కేంద్రం ఏడీ సనావుల్లా, ఏడీఏ సంచాలకులు ఎస్. సత్యనారాయణ వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. ఈనెలాఖరు కల్లా మండలంలోని రైతులందరికీ విశిష్ట సంఖ్య నమోదు పూర్తి చేయాలని వారు ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని 3,4 రైతు సేవా కేంద్రాలను సందర్శించి పురోగతిని ఆరా తీశారు. దొరిగిల్లు ఏబిపల్లి రైతు సేవా కేంద్రాలతో పాటు కందుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా వారు పరిశీలించారు. ఏఓ లక్ష్మీనరసింహులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మందులతోనే క్షయ నిర్మూలన


ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ గాయత్రిబాయి, సిబ్బంది

ధర్మవరం అర్బన్: క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం ద్వారా క్షయను పూర్తిగా నిర్మూలించవచ్చని వైద్యాధికారిణి గాయత్రిబాయి పేర్కొన్నారు. క్షయ నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు శుక్రవారం వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలను తెలియజేశారు. క్షయ బాధితులకు ప్రభుత్వం ఆరునెలల పాటు పౌష్టికాహారం కోసం రూ.వెయ్యి చొప్పున అందిస్తోందన్నారు. వ్యాధికి మొదటి దశలోనే మందులు తీసుకుంటే తొందరగా కోలుకుంటారని తెలిపారు. క్షయ నివారణ విభాగం కోఆర్డినేటర్ మల్లికార్జున, నాగేంద్ర, ధర్మవరం కమ్యూనిటీ ఆర్గనైజర్లు లక్ష్మీనారాయణ, అధ్యాపకుడు మల్లికార్జున, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన బోరు ఏర్పాటు

కదిరి అర్బన్: కదిరికుంట్లపల్లి పంచాయతీ ఆలంపూర్ క్వార్టర్స్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ రజనీష్‌రెడ్డి శుక్రవారం నూతన తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ పోలప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుప్రసాద్ పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ


గర్భిణికి పండ్లు అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: లక్ష్మీచెన్నకేశవపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ సురేష్‌నాయక్, సేవా సంస్థ వైస్ ప్రెసిడెంట్ జగ్గా వేణుగోపాల్ గర్భిణులకు పండ్లు అందించారు. సంస్థ సభ్యులు చిన్నప్ప, మంజునాథ్, చంద్రశేఖర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలి

తనకల్లు: ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల ప్రకారం పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పున పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. సీపీఐ మండల కన్వీనర్ రెడ్డెప్ప, నాయకులు కదిరప్ప, అంజినప్ప, నిజామెద్దీన్, శీనప్ప, మల్లికారున, రమేష్, పాపులమ్మ, ఆదిలక్ష్మి, రామలక్ష్మి, లక్ష్మీదేవి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: మండలంలో అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని మండల సీపీఐ నాయకులు శుక్రవారం తహసీల్దార్ దేవేంద్ర నాయక్ కు వినతి పత్రం అందించారు. సీపీఐ మండల కార్యదర్శి రమణ, వ్యవసాయ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మమ్మ, గంగిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నిత్య జీవితంలో సైన్స్ మమేకం


నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

చెన్నేకొత్తపల్లి: మానవుని నిత్య జీవితంలో సైన్స్ మమేకమై ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని చిల్డ్రన్స్ రిసోర్స్ సెంటర్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకున్నారు. చిగురు సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల విద్యార్థులు వివిధ సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. టింబక్టు కలెక్టివ్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చండి

ఎన్‌పీకుంట: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు పూర్తి కావొస్తున్నా ఇంత వరకు పీఆర్సీ, మధ్యంతర భృతి, పెండింగ్ డీఏలు, బకాయిల చెల్లింపులపై కనీసం ప్రకటన కూడా చేయలేదన్నారు. నాయకులు రామాంజులు యాదవ్, రమణానాయక్, మురళి, సందీప్, రహీం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆలయంలో చోరీ

తలుపుల: బత్రేపల్లి సమీపంలో కదిరి–పులివెందుల రోడ్డు పక్కన ఉన్న రాజరాజేశ్వరీ దేవి(గంగమ్మ) ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారికి చెందిన 7 వెండి గొడుగులు, 1 జత బంగారు కమ్మలు, హుండీలో భక్తులు వేసిన కొద్దిపాటి నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లిలో ఉన్న మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 31లోపు https://apms.apcfss.in లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాలలో ఏప్రిల్ 20న పరీక్ష ఉంటుందని తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడికి తీవ్రగాయాలు

తనకల్లు: చీకటిమానిపల్లి సమీపంలో జాతీయ రహదారి–42పై శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. తనకల్లుకు చెందిన రెడ్డిబాషా సిమెంట్ ఇటుకలు తెచ్చేందుకు ట్రాక్టర్‌పై చీకటిమానిపల్లికి వెళ్లాడు. అనంతరం అదే ట్రాక్టర్ ట్రాలీపై కూర్చొని ఇంటికి బయలుదేరాడు. అయితే కొద్దిదూరం రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో ఉన్న రెడ్డిబాషాకు కాళ్లు, ముఖానికి బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రున్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముదిగుబ్బ: మండల కేంద్రం సమీపంలో శుక్రవారం బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. సిద్దన్నగారిపల్లికి చెందిన గోపాల్, అరుణమ్మ, మరో యువతి స్వగ్రామం నుంచి బైక్‌పై ముదిగుబ్బకు బయలుదేరారు. ముదిగుబ్బ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. గాయపడిన ముగ్గురినీ స్థానికులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

దోమకాటుపై జాగ్రత్తలు తప్పనిసరి

ఎన్‌పీకుంట: ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ ఈటె రాము సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం మలేరియా సబ్ యూనిట్ అధికారులతో కలిసి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజులు, హెల్త్ సూపర్‌వైజర్ బాషా, ఏఓ లోకేశ్వరరెడ్డి, డాక్టర్ ఆసియా తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పంట నమోదు చేయాలి

ఓడీచెరువు: రబీ సీజన్లో సాగైన అన్ని పంటలకు పకడ్బందీగా పంట నమోదు చేయాలని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ తెలిపారు. ఇనగలూరులో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటిదాకా సుమారు 2500 ఎకరాల్లో పంట నమోదు చేసినట్లు ఏఈఓ వెంకటేష్ ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతాచారి, వీఆర్వో రమణ తదితరులు పాల్గొన్నారు